సాక్షి
సిద్దిపేట

మంగళవారం । 27 । జూన్ । 2023






**వేధించే వేరుతొలుచు పురుగు**

చెరకుతో పాటు ఇతర పంటలను నష్టపరిచే వేరుతొలుచు పురుగు నివారణకు సస్యరక్షణ పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

8లో



**ఫోన్‌కు స్పందించొద్దు..**

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట పోలీస్‌కమిషనర్ శ్వేత అన్నారు. లాటరీ, లోన్ పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌కు ఎవరూ స్పందించకూడదన్నారు.

8లో..



**పాఠశాలల బంద్ విజయవంతం**

ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేశారు.

9లో..

# మిల్లర్లపై కొరడా!



మిల్లులో మర పట్టిన బియ్యం

సాక్షి, సిద్దిపేట: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ బియ్యం) విషయంలో అక్రమాలకు పాల్పడినా, నిర్లక్ష్యం వహించినా మిల్లర్లపై కఠిన చర్యలకు రంగం సిద్ధమవుతోంది. ఆలస్యం చేసినా, అక్రమాలకు పాల్పడినా వారి వద్ద నుంచి జరిమానా వసూలు చేయనున్నారు. 2021–2022 వాన కాలానికి సంబంధించిన సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై ఇప్పటికే సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కొరడా ఝులిపించింది. జిల్లాలో వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ పెండింగులు ఏ మిల్లుల్లో లేవు. యాసంగికి సంబంధించి సీఎంఆర్ బకాయి మిల్లులు ఉన్నాయి.

**9వేల మెట్రిక్ టన్నులు**

సీఎంఆర్ జిల్లా వ్యాప్తంగా 2021–2022 యాసంగిలో 90,714 రైతుల దగ్గరి నుంచి 3,92,457 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీన్ని జిల్లా వ్యాప్తంగా 190 రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద అప్పగించారు.

- ఈ ధాన్యానికి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ బియ్యం)ను 2,45,091 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పగించాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,35,619 మెట్రిక్ టన్నుల బియ్యంను మాత్రమే అప్పగించారు. ఇంకా 21 రైస్ మిల్లులు 9,471 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది.
- ఎన్నో మార్లు గడువును పొడిగించి చివరగా ఏప్రిల్ 31తో గడువు విధించింది. సీఎంఆర్‌తో పెండింగ్‌లో ఉన్న మిల్లర్లతో సమావేశాలు, మిల్లుల తనిఖీలు అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం హరీశ్‌లు నిర్వహించారు. మిల్లర్లకు ఈ విషయాన్ని చెప్పిన వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పౌరసరఫరాల సంస్థ కొరడా ఝులిపించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.
- ఇప్పటికే 2021–2022 వానకాలానికి సంబంధించిన సీఎంఆర్‌కు 25శాతం ఫెనాల్టీతో 125శాతం రికవరీ చేయాలని నిర్ణయించారు. ఫెనాల్టీ విధించిన 25శాతాన్ని డబ్బు రూపంలో, 100శాతం బియ్యాన్ని రికవరీ చేయాలని పౌరసఫరాల సంస్థ ఆదేశించింది. అదే తీరుగా యాసంగికి సంబంధించిన బియ్యం రికవరీకి ఆదేశాలు రానున్నాయి. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం**

హుస్నాబాద్ పట్టణం ఆరెపల్లెలో ఏఆర్‌ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌లో రూ.27కోట్లు విలువ చేసే ధాన్యం మాయం అయ్యాయని ఇప్పటికే అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఆ మిల్లు యజమానిపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను అమలు చేశారు. ఎక్కువ మొత్తంలో సీఎంఆర్‌ను ఇదే మిల్లు అందించాలి.

**2021-2022 యాసంగి సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లు**

- పట్టించుకోని నిర్వాహకులు
- రావాల్సిన బియ్యం 9వేల మెట్రిక్ టన్నులు
- బియ్యం విలువపై 25శాతం జరిమానా వసూలు చేసేందుకు రంగం సిద్ధం

**చర్యలు తీసుకుంటాం**

2021–2022 వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ జిల్లాలో పెండింగ్ లేదు. యాసంగికి సంబంధించిన బియ్యం పలు మిల్లుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. యాసంగికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న మిల్లులపై చర్యలు తీసుకుంటాం. ఒకటి రెండురోజుల్లో ఉత్తర్వులు రాగానే నోటీసులు జారీ చేసి ఫెనాల్టీతో వసూలు చేస్తాం.

–హరీశ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

**నేడు జిల్లా వ్యవసాయాధికారితో**

## ఫోన్ ఇన్

వానాకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన మెలకువలు, విత్తనాల ఎంపిక, నకిలీ విత్తనాలను గుర్తించడం, ఎరువుల వాడకం, మోతాదు తదితర అంశాలపై రైతులకు ఉన్న సందేహాలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ నివృత్తి చేస్తు, సలహాలు, సూచనలు అందిస్తారు.



తేదీ : 27-06-2023

సమయం: మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :

9866898692, 8686960064

## న్యూస్‌రీల్

### రాష్ట్రంలో బీజేపీదే అధికారం

**జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి**



ఇంటింటి ప్రచారంలో దూది శ్రీకాంత్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారమని జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీరాములపల్లి, గుండారెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ధ్యేయంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కిసాన్‌యోజన ద్వారా 12కోట్ల మంది రైతులకు ఒక్కోరైతుకు ఏడాదికి రూ.6వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కృషి సించాయ్ యోజన ద్వారా 57లక్షమంది రైతులకు లబ్ధి చేకూర్చడంతో పాటుగా రైతు పెట్టబడి ఖర్చు కంటే 50శాతం అధికంగా ఎమ్ఎస్‌పి పెరుగుదల రైతు ప్రభుత్వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు చేను తిరుపతి, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి భీంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ముంజ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత సివిల్ కోచింగ్ ఇవ్వనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

**బీసీ అభ్యర్థుల నుంచి**

సివిల్స్‌కు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకోగోరు బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణదయాసాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు (040–27077929, 7780359322)లో సంప్రదించాలన్నారు.

### 'విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న సంఘం జాతీయ నాయకుడు పున్నమాచారి

హుస్నాబాద్: కుటీర పరిశ్రమలకు 20హెచ్‌పీ విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జాతీయ నాయకుడు రాచమట్ల పున్నమాచారి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆ సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నమాచారి మాట్లాడుతూ యూనిట్‌కు రూ.1.80 పైసలు ఉన్న విద్యుత్ చార్జీలను రూ.4లు చేశారని, దీనిని యూనిట్‌కు రూ.2 లకు తగ్గించాలన్నారు. కంచరి, శిల్పి, స్వర్ణకారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. 5ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే ఉచిత విద్యుత్, రైతుబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎగ్గోజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### మా సమస్యను పరిష్కరించండి



ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(ఎర్రవల్లి)లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని ఎర్రవల్లి(రెడ్డి కాలనీ)లో నిర్మించిన సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అడ్డంకిగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. తమకు కేటాయించిన ఇండ్ల ముందు కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తుందని, ఈ వర్షపునీరు వెళ్లే మార్గం లేకరోజుల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కొన్ని నెలలుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

# ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

**జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ**



రామంచలో సిలికాన్ కప్పులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామంచ, గంగాపూర్, పెద్దకోడూరు, రంగాయపల్లి గ్రామాల్లో మహిళలకు రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్లాత్ ప్యాడ్స్, సిలికాన్ కప్స్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతులైతేనే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. ఆరోగ్య తెలంగాణ కావాలంటే మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళలు శానిటరీ ప్యాడ్స్‌కు బదులుగా పర్యావరణహితమైన క్లాత్ ప్యాడ్స్‌ను వినియోగించాలన్నారు. అభ్యుదయ ఆలోచనతో మంత్రి హరీశ్‌రావు జిల్లాలో రుతుప్రేమ కార్యక్రమానికి అంకురార్పణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవకీ దేవి, డాక్టర్ శాంతి, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, సర్పంచ్‌లు హరిపురి సంతోషి, పన్యాల లింగారెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం



వర్గల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

- బడిబాటతో ఎన్‌రోల్‌మెంట్ పెరగాలి
- జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): కొత్త మెనూ ప్రకారం పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వర్గల్ మండలం నగరం తండా, అవుసులోనిపల్లి, రామక్కపేట, వర్గల్, గుంటిపల్లి, శాకారం, అంబర్‌పేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తీరు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, చతుర్విధ ప్రక్రియలు, విద్యార్థుల సామర్థ్యాల పెంపు, పుస్తక పఠనం తదితర అంశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాటను జూలై 31 వరకు పొడిగించినందున సర్కారు బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగేలా కృషి చేయాలన్నారు. జూలై నెలాఖరు వరకు పాఠశాలల్లో పఠనోత్సవం జరపాలన్నారు. విద్యార్థులకు మొదటి జత యూనిఫారాలు ఇచ్చారన్నారు. పాఠశాలల తనిఖీ సందర్భంగా ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు.

**డీఈఓ వైఖరిపై ఫిర్యాదు చేస్తాం: టీపీటీఎఫ్**

పాఠశాలల పనివేళలో ఉపాధ్యాయ సంఘాల నేతలను డీఈఓ తన వెంట తిప్పుకోవడం సరికాదని వర్గల్ మండల టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పర్వతం నర్సయ్య, పిల్లి రాములు పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్**

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని చెప్పి నేటికి వాటిని పంపిణీ చేయలేదన్నారు. జిల్లా పరిధిలో ఇంటర్నేషనల్ పాఠశాలలు, సిబిఎస్ఇ, ఒలంపియాడ్ పేరుతో లక్షల వ్యాపారం చేస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలు, కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే లక్షల డొనేషన్లు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా సహాయకార్యదర్శులు నాచారం శేఖర్, చెప్యాల సంతోష్, జిల్లా నాయకులు భాను, కిరణ్, మధు అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

## ప్రజలకు చేరువ కావాలి

**కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్**

సిద్దిపేటజోన్: రాబోయే కాలంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు చేరువయ్యేలా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్ అన్నారు. జిల్లా ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్ర నాయకులు, రాష్ట్ర పీసీసీ చీఫ్ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. కాంగ్రెస్ బలహీన వర్గాలకు చేసిన మేలు, సంక్షేమ పథకాలు గూర్చి ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏండ్లుగా బడుగు, బలహీన వర్గాలకు చేసిన మోసాన్ని అన్ని జిల్లాల్లో ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు సూర్య వర్మ, జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ, పట్టణ శాఖ అధ్యక్షుడు అత్తు, సీనియర్ నాయకులు ప్రభాకర్ వర్మ, గంప మహేందర్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్

## బంగారు భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దు

**సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి**



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేట ఎడ్యుకేషన్: బంగారు భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దని, దేశ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని గురుకృప జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు వినియోగంతో జరిగే నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మత్తు పదార్థాల వినియోగం, సరఫరా రెండు నేరమేనన్నారు. ఉత్తమ పౌర సమాజాన్ని నిర్మించుకునే బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ డైరెక్టర్ పాల సాయిరాం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సిద్దిపేట పాత బస్టాండ్ వరకు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ (ఎన్ఎస్ఎస్) అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి సూచించారు.

## 'అవినీతికి అడ్డాగా వ్యవసాయ సహకార సంఘం'

దుబ్బాకటౌన్: దుబ్బాక వ్యవసాయ సహకార సంఘంలో రూ.40 లక్షల అవినీతి జరిగినా ఇంత వరకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని డీసీసీ కార్యదర్శి ఏలూరి కమలాకర్ అన్నారు. సోమవారం దుబ్బాకలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దుబ్బాక సహకార సంఘంలో అవినీతి జరిగిన విషయం గురించి పత్రికల్లో వార్తలు రావడంతో ఉన్నతాధికారులు విచారించి సీఈఓ లక్ష్మారెడ్డిని తొలగించి చేతులు దులుపుకున్నారే తప్పా ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఈ అవినీతిలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావులకు సైతం భాగస్వామ్యం ఉందని ఆయన ఆరోపించారు. ఎరువుల బ్లాక్ దందాను త్వరలోనే బయటపెడుతామన్నారు. వెంటనే దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం పాలక మండలిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, బాల్‌నర్స్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# సత్వర పరిష్కారమే లక్ష్యం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణికి 40 దరఖాస్తులు




అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌ఓ లక్ష్మీకిరణ్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం పెరుగుతున్నందునా ఎక్కువగా అర్జీదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నారన్నారు. వారి నమ్మకం మేరకు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూ సంబంధిత, డబుల్‌బెడ్రూం, పెన్షన్లు తదితర సమస్యల పరిష్కారానికి 40 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రెహమన్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### డబ్బులిస్తాం.. మా భూమి మాకు ఇవ్వండి



నా పేరు దేవునూరి శ్రీనివాస్, తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామం మల్లన్నసాగర్ నిర్మాణంలో భాగంగా నాకు సంబంధించిన 811, 812, 847 సర్వే నెంబర్లలోని 1-26 గుంటల భూమిని అదనపు టీఎంసీ కోసం ప్రభుత్వ స్వాధీనం చేసుకుంది. దీనికి గాను మొదటి విడతగా డబ్బులు అందించారు. కాని కాల్వ నిర్మాణంలో మా భూమి ఏమాత్రం పోలేదు. దీంతో ప్రభుత్వం మాకు ఇచ్చిన డబ్బులను తిరిగి వెనక్కి ఇస్తాం మా భూమిని మా పేరు మీదనే ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– దేవునూరి శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట

### రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్‌ను ఒకశాతం కాంట్రిబ్యూషన్‌తో అమలుచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని, ప్రతీ నెల 1వ తేదీన పెన్షన్లు చెల్లించడంతో పాటు, పెండింగ్ బిల్లులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, బాలయ్య, రాములు, రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.

– వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

### అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెరువును పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోదా అరుణ్ యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి సందబోయిన ఎల్లయ్యలు ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు మండలం కొక్కొండ గ్రామంలోని 40 ఎకరాలలో బండచెరువు ఉండగా, దాని పరిధిలో ఆయకట్టు విస్తీర్ణం 300ఎకరాల భూమిని సాగు చేస్తున్నారన్నారు. అందులో 5ఎకరాల భూమిలో మట్టిని పోసి హైదరాబాద్‌కు చెందిన సుమన్ రెడ్డి పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణంతో వర్షాలకు చెరువు నిండి రోడ్డుపైకి నీరు వస్తుందన్నారు. చెరువు విస్తీర్ణం తగ్గుతుంది. అక్రమంగా చెరువులో నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించాలని, చెరువు భూమిని కాపాడాలని కోరారు.

– గోదా అరుణ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు
సందబోయిన ఎల్లయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి

## క్లుప్తంగా

### ఆల్ఫాజోలం విక్రయించిన వ్యక్తికి పదేళ్ల జైలు

మెదక్‌జోన్: ఆల్ఫాజోలం విక్రయించిన ఓ వ్యక్తికి శిక్ష పడింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. రేగోడు గ్రామానికి చెందిన మునిగల గంగాధర్ 2017లో కల్లులో మత్తుకోసం కలిపే 4 కిలోల అల్ఫాజోలంతో పట్టుబడ్డాడు. వెంటనే రిమాండ్ చేయగా, ఆరేళ్ల పాటు కేసు ట్రయల్ నడిచింది. నేరం రుజువు కావడంతో సోమవారం జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద నిందితుడికి పదేళ్లజైలు, రూ.లక్ష జరినామా విధిస్తూ తీర్పు చెప్పారు. ఆల్ఫాజోలంలాంటి మత్తు పదార్థాలను కల్లులో ఎవరూ కలిపినా, విక్రయించినా శిక్షార్హులన్నారు. కేసులో చొరవ చూపిన కోర్టు కానిస్టేబుల్ ప్రశాంత్, సీఐ నాగేశ్వరరావును రజాక్ అభినందించారు.

### పశువుల అక్రమ తరలింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జహీరాబాద్ నుంచి నగరంలోని ముషీరాబాద్ ప్రాంతానికి మూడు వాహనాల్లో తరలిస్తున్న 14గేదెలు, 5ఎద్దులను రామచంద్రాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ఇక్రిశాట్ వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో పట్టుకున్నారు. పశువులను కూకట్‌పల్లిలోని గోశాలకు తరలించారు.

### కేసు నమోదు

కోహెడరూరల్(హుస్నాబాద్): సంతకం ఫోర్జరీ చేసిన ఒకరిపై కేసు నమోదైంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన తాటిపాముల కిషన్ తన తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తల్లి పేరు మీదకు మార్చేందుకు పంచాయతీ కార్యదర్శి సంతకం, కార్యాలయ ముద్రను ఫోర్జరీ చేశాడు. సోమవారం పంచాయతీ కార్యదర్శి నిహారిక ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

### ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

సంగారెడ్డి అర్బన్: వరుసగా బైక్ దొంగతనాల నేపథ్యంలో పోలీసులు నిఘా పెట్టి ఒకరిని అరెస్ట్ చేశారు. సంగారెడ్డి పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, వడ్డే నవీన్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయగా, తాను మూడు బైక్‌లు దొంగతనం చేశానని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ఆ బైక్‌లను స్వాధీనం చేసుకొని జడ్జి ఎదుట హాజరుపరచగా, రిమాండ్ విధించారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎస్ఐ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్ల అన్వర్, శేఖర్‌లను సీఐ అభినందించారు. కాగా నిందితుడి స్వస్థలం శంకర్‌పల్లి.

### విద్యుదాఘాతంతో నాలుగు మేకలు మృతి



వర్గల్(గజ్వేల్): విద్యుదాఘాతంతో నాలుగు మేకలు మృతి మృతి చెందాయి. బాధిత మేకల కాపరి రాయన్న యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... మేకలు, గొర్రెల మందను మేతకోసం తీసుకెళ్లాడు. సోమవారం సాయంత్రం వాటిని ఇంటి వద్ద కొట్టానికి తరలిస్తుండగా, రంగంచెరువు కట్ట ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగతాకి ఓ మేక కరెంట్ షాక్‌కు గురైంది. వరుసగా మరో మూడు మేకలకు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాయి. ఆదివారం సాయంత్రం చీమల నర్సయ్యకు చెందిన ఒక గొర్రె ఇక్కడే మృతి చెందింది. అయితే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ వస్తున్న సమాచారం విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ పాపిరెడ్డి వాపోయారు.

### మతి స్థిమితం లేని మహిళ అదృశ్యం



జ్యోతి (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): మతి స్థిమితం సరిగ్గా లేని ఓ మహిళ అదృశ్యమైంది. దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యకుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి జ్యోతి (38) మతిస్థిమితం సరిగ్గా లేక భర్తతో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుని పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో నుంచి దౌల్తాబాద్ వెళుతున్నట్టు చెప్పింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు బంధువుల వద్ద, చుట్టుపక్కల వారి దగ్గర, సమీప గ్రామాలలో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. ఆమె గతంలోనూ ఓసారి ఇలాగే అదృశ్యమై కొన్నాళ్ల తర్వాత తిరిగి ఇంటికి వచ్చిందని ఎస్ఐ తెలిపారు.



# వేధించే వేరుతొలుచు పురుగు

- తొలకరి వర్షం తర్వాత వృద్ధి ఎక్కువ
- చెరకు, అల్లం, పత్తి, కంది పంటలకు నష్టం



ఎస్.స్నేహలత
సస్యరక్షణ శాస్త్రవేత్త

జహీరాబాద్: చెరకుతో పాటు ఇతర పంటలను వేరుతొలుచు పురుగు ఆశించి అపారనష్టం కలిగిస్తోంది. ఏటా వర్షాకాలంలో దీని ఉధృతి అధికంగా ఉంటోంది. చెరకు, పత్తి, కంది, మొక్కజొన్న, మిరప, అల్లం వంటి పంటలను సైతం దెబ్బతీస్తోంది. పంట వేసినప్పుడు ఈ పురుగు ఆశించి, పంటలేనప్పుడు భూమిలో దాగి ఉంటుందని డీడీఎస్–కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఎస్.స్నేహలత పేర్కొన్నారు. ఎప్పుడయితే మొదటి వర్షం పడుతుందో అప్పుడు భూమిలో ఉన్న పురుగులు వేప, రేగు, మునగ పంటలపై ఆశించి వాటి సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయన్నారు. భూమిలో ఉన్న తల్లి పురుగులు 50–60 సెంటీ మీటర్ల లోతున 30–35 గుడ్లు పెడుతుందని, ఇలా పొదిగిన లద్దెదశలు కొత్తగా వేసిన పంటల వేరు వ్యవస్థను ఆశిస్తాయన్నారు. ఈ పురుగు యాసంగిలో కోశస్థ దశకు మారి భూమిలోనే ఉండిపోయి మళ్లీ వర్షాలు పడినప్పుడు బయటకు వస్తాయని, ఇలా వాటి జీవితచక్రాన్ని పూర్తి చేస్తాయన్నారు.

**నష్టపరిచే విధానం**

వేరుపురుగు ఆశించిన పంటను గమనిస్తే ఆకులు పసుపు రంగులోకి మారి పంట వడలిపోతుంది. ఇలా వడలిన మొక్కలను పీకినప్పుడు చాలా సులభంగా బయటకు వస్తాయి. పప్పు దినుసుల్లో వేరు వ్యవస్థ నత్రజనిని ఆశించే బుడిపెలు కలిగి ఉంటాయి. వాటిని ఈ పురుగు ఆశించి నత్రజని సౌకర్యాన్ని అందకుండా చేయడానికి ఆస్కారం ఉంటుంది. ఈ పురుగు ఎక్కువగా చెరకులో రటూన్(మొడెం) పంటను ఆశిస్తుంది.

**యాజమాన్య పద్ధతులు**

- పంట వేసుకునే ముందు లోతు దుక్కులు చేసుకోవాలిత
- రైతులు పెంట ఎరువులు వేస్తారు. మగ్గిన పెంటఎరువులో ఈ పురుగు ఎక్కువగా గుడ్లు పెడుతుంది. వీటి వృద్ధికి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి చిలికిన పెంటను ఎరువుగా వేసుకోవాలి.
- మొక్కలు ఎండిపోయి, వడలిపోయినట్టు కనిపిస్తే మెటారైజియం అనే సూక్ష్మం 5 గ్రాములను లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడపాలి లేదా డ్రిప్ నీటివసతి కలిగి ఉంటే అందులో వదలాలి.
- వేసవి జల్లులు ముగిసిన వెంటనే పంట చుట్టూ ఉన్న వేప, అకేశియా చెట్లు ఉన్న చోట లైట్ ట్రాప్స్ పెట్టుకోవడం వల్ల తల్లి పురుగు ఆకర్షితమై అందులో పడిపోతాయి. ఇలా పడిన వాటిని చంపివేయాలి.
- దశపర్ణి కషాయం 6 లీటర్లు ఒక ఎకరానికి కలిపి మొదళ్లను తడపాలి.



వేరు తొలిచే పురుగు

# మత్తులో గొంతు కోశాడు



మెడపై తీవ్ర గాయాలతో సంఘు విక్రమ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మద్యం మత్తులో స్నేహితుడి గొంతుకోశాడో యువకుడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గుడాటిపల్లి గ్రామానికి చెందిన బైరి నరసింహ, హుస్నాబాద్‌కు చెందిన సంఘు విక్రమ్‌లిద్దరూ స్నేహితులు. ముంపు గ్రామానికి చెందిన నరసింహ హుస్నాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి మద్యం తాగుదామని నరసింహ, విక్రమ్‌ను తన వెంట తీసుకొని జనగామ శివారులోకి వెళ్లాడు. మందు తాగాక విక్రమ్‌తో నరసింహ గొడవకు దిగాడు. పథకం ప్రకారంగా ముందుగానే జేబులో కత్తి ఉంచుకున్న నరసింహ ఘర్షణ పడుతున్న క్రమంలో ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ముందుగా మెడపై కోసి, ఆ తర్వాత తలపై పొడిచాడు. విక్రమ్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు హుస్నాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విక్రమ్ అన్న సంఘ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ తాండ్ర వివేక్ పేర్కొన్నారు. అయితే నిందితుడు పరారీలో ఉన్నాడు.

**గుప్పుమంటున్న గంజాయి**

గౌరవెల్లి రిజర్వాయర్ కట్టపై, శివారు గ్రామాల్లో గంజాయి గుప్పుమంటోంది. రాత్రయితే చాలు యువకులంతా ఆ పరిసరాలకు చేరి గంజాయి సేవిస్తున్నారు. పోలీసులు నిఘా పెంచి గంజాయిని కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అతిగా మద్యం సేవించి...



సునీల్‌చౌహాన్ మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): అతిగా మద్యం సేవించి నిద్రలోనే ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన సునీల్‌చౌహాన్ (38) మండలపరిధిలోని కాళ్ళకల్‌లోని మహాలక్ష్మి ప్రొఫైల్ పరిశ్రమ క్వార్టర్స్‌లో ఉంటూ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండురోజులుగా విపరీతంగా మద్యం సేవిస్తున్నాడు. ఆదివారం రాత్రి కూడా మద్యం సేవించి రూమ్‌లో పడుకున్నాడు. సోమవారం ఉదయం తోటి కార్మికులు ఎంతలేపినా నిద్ర లేవలేదు. దీంతో పరిశ్రమ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బాబాయి రమాకాంత్ చౌహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశ్రమల సమీపంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల ఏర్పాటు చేయడంతో కార్మికులకు మద్యానికి బానిస అవుతున్నారని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

**ఉరి వేసుకొని యువకుడు..**

సిద్దిపేటఅర్బన్: అస్తమాతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన అనిమేల సతీష్‌శర్మ కుమారులు భరద్వాజ శర్మ (18), షణ్ముఖశర్మ గతేడాది నుంచి సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్‌లోని శ్రీ సదానంద వైదిక పాఠశాలలో కృష్ణయజుర్వేదం చదువుకుంటున్నారు. అయితే భరద్వాజశర్మ రెండేళ్లుగా అస్తమాతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా తగ్గలేదు. ఈ నెల 24న భరద్వాజ పుట్టినరోజు సందర్భంగా తండ్రి సతీష్ శర్మ పాఠశాలకు వచ్చాడు. పుట్టినరోజు వేడుక చేసి ఆరోగ్య వివరాలు అడిగాడు. అంతా బాగుందని చెప్పడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం షణ్ముఖశర్మ తన తండ్రికి ఫోన్ చేసి భరద్వాజ అస్తమాతో ఇబ్బంది పడుతున్నాడని, హాస్టల్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడని చెప్పాడు. కొంత సేపటికి పాఠశాల ఉపాధ్యాయుడు పవన్‌శర్మ సతీష్‌శర్మకు ఫోన్ చేసి భరద్వాజ హాస్టల్‌లో ఫ్యానుకు ఉరేసుకున్నాడని చెప్పాడు.విద్యార్థుల సాయంతో కిందకు దింపి సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరీక్షించి చనిపోయినట్టు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**కలహాల నేపథ్యంలో...**

కోహీర్(జహీరాబాద్): ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం కవ్వంపల్లికి చెందిన సాయిరాం(25) కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గీతను వివాహం చేసుకున్నాడు. ఓ ప్రైవేట్ కర్మాగారంలో పనిచేస్తూ మేనమామ వద్దే ఉంటున్నాడు. అయితే భార్యాభర్త తరచు గొడవపడేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం లేచి చూసేసరికి భర్త సాయిరాం ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# ఫోన్‌కు స్పందించొద్దు.. వివరాలు చెప్పొద్దు

**సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త : సిద్దిపేట సీపీ శ్వేత**



సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట పోలీస్‌కమిషనర్ శ్వేత అన్నారు. లాటరీ, లోన్, బహుమతి పేరుతో, తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని వచ్చే ఫోన్‌కాల్స్‌కు ఎవరూ స్పందించకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంక్, ఏటీఎం డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, పిన్ నంబర్లు, ఓటీపీ వంటి వివరాలు చెప్పొద్దన్నారు. సిద్దిపేట జిల్లాలో ఈ సంవత్సరం సైబర్ మోసాల ద్వారా పోగొట్టుకున్న వాటిలో రూ.46,55,964 ఫ్రీజ్ చేశామని, త్వరలో విడతల వారీగా సంబంధిత బాధితుల ఖాతాల్లో జమవుతాయన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం జరిగిన పలు సైబర్ నేరాలపై సీపీ తెలిపిన వరాల ప్రకారం..

**ఇండియన్ బుల్స్ కంపెనీ పేరుతో..**

సిద్దిపేట వన్‌టౌన్ పీఎస్ పరిధిలో ఓ వ్యక్తికి గుర్తు తెలియని ఒకరు ఫోన్‌చేసి ఇండియా బుల్స్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. మీకు లోన్ మంజూరైంది... లోన్ ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబర్‌కు ఫోన్ పే ద్వారా రూ.10,653 పంపించాడు. తర్వాత మరిన్ని డబ్బులు పంపాలని గుర్తు తెలియని వ్యక్తి భయపెట్టడంతో అనుమానం వచ్చిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

**లోన్‌యాప్ పేరిట..**

రాజగోపాలపేట పీఎస్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో లోన్ టీకాయాప్‌లో లోన్ తీసుకుని తిరిగి మిత్తితో సహా అసలు మొత్తం డబ్బు చెల్లించాడు. కానీ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇంకా డబ్బులు చెల్లించాలని బెదిరించడంతో బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.6,100 పంపించాడు. అనంతరం సైబర్ నేరగాడు మళ్లీ ఫోన్ చేసి ఇంకా డబ్బులు పంపించాలని లేదంటే నీ ఫొటోలు న్యూడ్‌గా ఎడిట్ చేసి వాట్సాప్, సోషల్ మీడియాలో షేర్ చేస్తానని బాధితుడిని బెదిరించాడు. అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.

**మహిళ డీపీతో...**

రాజగోపాలపేట పీఎస్ పరిధిలోని ఓ మహిళ ఇన్‌స్టాగామ్ ఖాతాను సైబర్ నేరగాడు హ్యాక్ చేశాడు. తాను ఆపదలో ఉన్నానని డబ్బులు పంపించాలని కోరాడు. స్పందించకపోవడంతో ఆమె డీపీ (ఫొటో)ను ఉపయోగించి వేరే ఫోన్‌నంబర్ ద్వారా వాట్సాప్ క్రియేట్ చేశాడు. మెసేజ్ పంపించగా స్పందించిన బాధితురాలు ఆన్‌లైన్‌లో రూ.5 వేలు పంపించింది. తర్వాత విచారణ చేసుకోగా గుర్తు తెలియని వ్యక్తికి డబ్బులు పంపినట్టు సైబర్ మోసం జరిగినట్టు గుర్తించి ఫిర్యాదు చేసింది.

# బంగారం అపహరించిన మహిళల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

మెదక్ మున్సిపాలిటీ: బంగారం అపహరించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ..ఈ నెల 9వ తేదీన మెదక్ పట్టణంలోని మెహతాబ్ బంగారు దుకాణంలో నలుగురు మహిళలు 30 గ్రాముల బంగారు బిస్కెట్, 4 జతల కమ్మలు అపహరించారు. దుకాణయజమాని షకీల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఖమ్మం జిల్లాలోని మధిర మండలం, రాయపట్నం గ్రామానికి చెందిన బాలసాని వెంకటరామమ్మ, బొజ్జని నాగేంద్రమ్మ, బొజ్జని దీనమ్మ , నల్లబొట్ల వెంకటమ్మలుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకున్న ఎస్ఐ లింగం, కానిస్టేబుల్ సాయిబాబాగౌడ్, శివరాజ్‌గౌడ్, గంగరాజు, రవి, రాజులను సీఐ అభినందించారు.

# ముత్తిరెడ్డి అక్రమాలను కన్నకూతురే బయటపెట్టింది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

**మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి**

చేర్యాల(సిద్దిపేట): మత్తడి వద్ద పశువుల సంత జరిగే స్థలాన్ని కొనుగోలు చేయడం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తప్పిదమనే విషయాన్ని కూతురు తుల్జాభవానిరెడ్డి బయటపెట్టిందని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరిప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్షం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చెరువు మత్తడి కింద నీటి పరీవాహక ప్రాంతం బఫర్ జోన్ కిందకు వస్తుందని, అయినా ఆ భూమిని తన కూతురు పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించారు. 2020లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే, 2018లోనే నిర్మాణానికి అనుమతులు పొందాడని, గ్రామ పంచాయతీ పరిమితి దాటి అనుమతి ఇచ్చేందుకు కార్యదర్శులను సైతం బెదిరించడంతో కొందరు కార్యదర్శులు సెలవుపై వెళ్లిపోయిన ఘటనలు కూడా తన దృష్టికి వచ్చాయన్నారు. ఆ స్థలంలో చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న అఖిలపక్షం నాయకులపైఅధికార బలం తో కేసులు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నకాలంలో నర్మెట్ట, చేర్యాల మండలాల్లో దాదాపు 20ఎకరాలు భూమి ప్రజావసరాలకు దానంగా ఇచ్చానన్నారు. స్థానికేతరుడు కావడం వల్లనే ఈ ప్రాంత అభివృద్ధిని మరిచి దోచుకుంటున్నాడని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కూతురు తుల్జాభవానిరెడ్డి తన పేరిట ఉన్న భూమిని మున్సిపాలిటీకి రాసిస్తాననడం హర్షణీయమన్నారు. గతంలో ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసే సమయంలో అడ్డుకొని గోడ కూల్చిన విషయమై పట్టణ కేంద్రానికి చెందిన పలువురిపై నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని ఆముదాల మల్లారెడ్డి కోరారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు కొమ్ము నర్సింగరావు, వెంకట్‌మావో, అశోక్, రాజు, బీరయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ఎర్రవల్లి మహిళలతో సమావేశమైన అధికారులు

మర్కూక్(గజ్వేల్): ఎర్రవల్లి, మర్కూక్ గ్రామాలను జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ప్రొఫెసర్ రాజేశ్వర్, ఏపీడీ కౌసల్యదేవితో కలిసి సందర్శించారు. మహిళాసంఘాల సభ్యులతో అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ పల్లె ప్రగతి, హరితహారంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయంఉపాధి ఎంచుకొని రాణించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, రాజలింగం, సర్పంచ్‌లు భాగ్య, భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.

# పాముకాటుతో విద్యార్థి మృతి



సంజయ్‌కుమార్ (ఫైల్)

గజ్వేల్‌రూరల్: పాముకాటుతో ఓ విద్యార్థి మృతి చెందాడు. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని అనంతరావుపల్లి గ్రామానికి చెందిన గద్ద విజయ్–పద్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు సంజయ్‌కుమార్(16) ఉన్నారు. సంజయ్ అల్వాల్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి పశువులకు మేత వేసి వస్తున్న క్రమంలో సంజయ్ కాలికి పాముకాటు వేసింది. దీంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పూలే గురుకులంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

**71 మంది విద్యార్థినుల ఎంపిక**



మాట్లాడుతున్న ముత్యంకుమార్

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మజ్యోతిబాపూలే మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం ఈఎంఆర్ఐ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) గ్రీన్‌హెల్త్ సర్వీసెస్‌లో ఉద్యోగాల కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ చేపట్టారు. తెలంగాణ అకాడమీ స్కిల్, నాలెడ్జి కేంద్రం ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమానికి గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా తెలంగాణ అకాడమీ స్కిల్, నాలెడ్జి టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్ ముత్యం కుమార్, ఈఎంఆర్ఐ కరీంనగర్ జిల్లా మేనేజర్ షేక్ సలీం హాజరయ్యారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ కు 204 మంది డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు హాజరుకాగా 71 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. స్కిల్, నాలెడ్జి కేంద్రం మేనేజర్ ముత్యంకుమార్ విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏటీపీ భాగ్యలక్ష్మి, వీపీ గోవిందరావు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ నిఖిత, డీడబ్ల్యు భాగ్యలక్ష్మి, వర్షిని పాల్గొన్నారు.

# దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

**మహిళ కడుపు నుంచి ఐదుకిలోల గడ్డ తొలగింపు**




భవానితో దుబ్బాక ఆస్పత్రి వైద్య బృందం

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో మరో అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. జగిత్యాల జిల్లాకు చెందిన మహిళకు సర్జరీ చేసి ఆమె కడుపులో నుంచి 5 కిలోలకు పైగా ఉన్న రెండు ఫైబ్రెడ్ గడ్డలను వైద్యులు తొలగించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం..జగిత్యాల జిల్లాకు చెందిన భవాని కడుపు నొప్పితో వివిధ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. వారం రోజుల క్రితం తమ బంధువులతో సమాచారం తెలుసుకొని దుబ్బాక ఆస్పత్రికి వచ్చింది. భవానికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె కడుపులో గడ్డలు ఉన్నట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే ఆమెకు సోమవారం డాక్టర్ హేమరాజు సింగ్ ఆపరేషన్ నిర్వహించి కడుపులోంచి గడ్డలను తొలగించారు. ప్రస్తుతం భవాని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గాయపడిన ముగ్గురు చికిత్స పొందుతూ మృతి చెందారు.

**ప్రమాదవశాత్తు జారిపడి...**



కనకయ్య (ఫైల్)

కొండపాక(గజ్వేల్): త్రీటౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిదిలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన దండమైన కనకయ్య(50) కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో భార్యాపిల్లలు హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కనకయ్య స్వగ్రామంలో తల్లి వద్ద ఉంటున్నాడు. 21వ తేదీన మద్యం సేవించి ప్రమాదవశాత్తు ఇంటి వద్ద జారి పడటంతో తలకు బలమైన గాయాలై కోమాలోకి వెళ్లాడు. సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యులు గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**వివాహిత...**



దివ్య(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన దివ్య(18) అదే రాష్ట్రానికి చెందిన వికాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. బతుకుదెరువు కోసం మండల పరిధిలోని ఇస్నాపూర్‌కు వచ్చి అద్దెకు ఉంటున్నారు. వికాస్ డీమార్ట్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన వికాస్ ఎప్పటిలాగే పనికి వెళ్లగా మధ్యాహ్నం అతని భార్య దివ్య ఫోన్‌చేసి ఇంటికి రమ్మని చెప్పింది. దీంతో వికాస్ ఇంటికి వెళ్లేసరికి ఎలుకల మందు తాగానని చెప్పడంతో ఆమెను వెంటనే పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి దివ్య చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రాధాగజనాన్ తన కూతురు ఆరోగ్య పరిస్థితి సరిగాలేక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**జీవితంపై విరక్తి చెంది...**



ఖైరాత్‌అలీ మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బీబీపేటకు చెందిన ఎండీ ఖైరాత్‌అలీ(65) ఆరోగ్యం సరిగ్గా ఉండడం లేదు. దీంతో జీవితంపైకి విరక్తి చెంది ఈ నెల 22వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.